

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 4,28,930
బంగారం : 1 గ్రాము 600 మిల్లీ గ్రాములు
వెండి : 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



అంబరాన్ని తాకిన సంబరం

బరంపురంలో సంబరాలు అంబరాన్ని తాకాయి. వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

- 8లో



సన్నాహక సమావేశం

రాజధాని స్థాపన దినోత్సవానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

యువ డాక్టర్ రక్తదానం



రక్త దానం చేస్తున్న వైద్యుడు సుమంత్

కొరాపుట్: వైద్యుడు దేవుడుతో సమానం అనే మాట నిరూపించాడు ఆ యువ డాక్టర్. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఓ మహిళను అత్యవసర చికిత్స కోసం బంధువులు శుక్రవారం తీసుకొచ్చారు. రోగిని పరిశీలించిన యువ డాక్టర్ సుమంత్ రంజన్ బాల్ ఆమెకి రక్తం ఎక్కించాల్సి ఉందని బంధువులకు వివరించారు. అత్యవసర సమయంలో ఆమెకి రక్త లభించలేదని వారు చేతులెత్తేశారు. దాంతో ఆలోచించిన సుమంత్ తనది ఆమె గ్రూప్ కావడంతో రక్తదానం చేసి ప్రాణదానం చేశారు. డాక్టర్‌ను అక్కడ ఉన్నవారు అభినందించారు.

పాముకాటుతో ఏడేళ్ల బాలిక మృతి



పాము కాటుకు మరణించిన బాలిక చుమి

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంధ్ర సమితి దిగాపూర్ పంచాయతీ ప్రధానిపుట్ గ్రామంలో దొయిమతి గుండి కుమార్తె చుమి (7) పాముకాటుకు గురై మృతి చెందిందని బొయిపరిగుడ పోలీసులు శుక్రవారం వెల్లడించారు. దొయిమతి తన ముగ్గురు పిల్లలతో గురువారం ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో అకస్మాత్తుగా చుమి అరుస్తూ లేచింది. ఏదో కరిచిందని చెప్పగా.. ఇంటి వారంతా లేచి చూశారు. పాము కరిచి ఉంటుందని బాలికను వెంటనే బైక్‌పై జయపురం జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకువచ్చారు. బాలికను పరీక్షించిన డాక్టర్ చుమి ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య



ఫ్యాన్‌కు వేలాడుతున్న ప్రమీల మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితిలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలిమెల సమితి ఎంవీ 70 గ్రామానికి చెందిన ప్రసంజిత్ దత్తకు, బలిమెల పోలీసు స్టేషన్ పరిధి ఎంవీ 109 గ్రామానికి చెందిన రామకృష్ణ కబిరాజ్ కుమార్తె ప్రమీలతో గతేడాది వివాహం జరిగింది. అయితే గత ఆరు నెలలుగా ఇద్దరి మధ్య గొడవలు వచ్చాయి. దీంతో అత్తింటి వేధింపులు తాళలేక ప్రమీల పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా ఇటీవల మరలా తిరిగి ఆమె భర్త, కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. కాగా కొద్దిరోజుల్లోనే తన గదిలో ఉరివేసుకొని మృతి చెందింది. అయితే తన కుమార్తెను అత్తింటి వారే హత్య చేశారని మృతురాలి తండ్రి ఆరోపించారు. ఘటనా స్థలానికి ఐఐసీ చంద్రకాంత్ తండి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కొరాపుట్ నుంచి సైంటిఫిక్ బృందం వచ్చాక మృతికి కారణాలు తెలిసే అవకాశం ఉంది.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు




అరెస్టయిన వారితో పోలీసు సిబ్బంది

రాయగడ: చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను జిల్లాలోని అంబొదల పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వారివద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, 50 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

అంబులెన్స్‌లో పేలిన ఆక్సిజన్ సిలిండర్

భువనేశ్వర్: అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ పేలి బాలింత తీవ్రంగా గాయపడిన ఘటన బొలంగీర్ జిల్లా టిట్లాగఢ్ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. పసికందుతో బాలింతని అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా ఆక్సిజన్ సిలిండర్ ఆకస్మికంగా పేలింది. ఈ పేలుడులో బాలింతకు గాయాలయ్యాయి. ఈమెతో పాటు మరో 2 మంది బంధువులు స్వల్పంగా గాయపడ్డారు. అదృష్టవశాత్తు ప్రాణహాని సంభవించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బాధిత మహిళని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు.





బోర్డులు ఒడియాలోనే ఉండాలి



అవగాహన ర్యాలీలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ ఇతర ఉద్యోగులు



అవగాహన ర్యాలీలో మల్కన్‌గిరి మహిళా కళాశాల విద్యార్థినులు



ఒడియాలో సైన్‌బోర్డులు రాయాలని పాదయాత్ర అభియాన్‌లో కలెక్టర్ బిజయకుమార్ దాస్



పచ్చ జెండా ఊపి ఒరియా భాష సచేతన పాదయాత్రను ప్రారంభించిన సబ్ కలెక్టర్ శౌశ్య రెడ్డి



ఒడియా అస్మితా అభియాన్ పాదయాత్రలో కలెక్టర్, జిల్లా కార్మిక ఉపాధిశాఖ అధికారి భారతీ బెహరా



అమొ ఒడియా, అమొ పరిచయ్ ప్రచార పాదయాత్రలో మహిళా గ్రూపులు

జయపురం:

విద్యాలయాలకు, వ్యాపార వాణిజ్య సంస్థలకు ఒడియాలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు శుక్రవారం విద్యార్థులు జయపురంలో భారీ పాదయాత్ర చేశారు. స్థానిక లేబర్ విభాగ కార్యాలయం అధికారులు నిర్వహించి ఒడియా సైన్ బోర్డు అభిజాన్ పాద యాత్రను జయపురం సబ్ కలెక్టర్, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కుమారి అక్కవరం శౌశ్య రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్రలో పాల్గొన్న స్థానిక తెలుగు సాంస్కృతిక సమితి వారు నిర్వహిస్తున్న సిటీ ఉన్నత పాఠశాల విద్యార్థులు లేబర్ కార్యాలయం నుంచి 26 వ జాతీయ రహదారిలో గాంధీ జంక్షన్, ఒడియ మేదరి వీధి, గౌడ వీధి మొదలగు ప్రాంతాల్లో గల వ్యాపార, వాణిజ్య సంస్థలకు, ప్రజల వద్దకు వెళ్లి ఒడియా భాషలో బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాదయాత్రను సిటీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రతాప్ కుమార్ పట్నాయక్, పాఠశాల క్రీడా ఉపాధ్యాయిని రీతా సామంతరాయ్ పర్యవేక్షించారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణాలు, వాణిజ్య సంస్థల బోర్డులు ఒడియాలోనే రాయాలని అవగాహన కల్పించారు. ఒడియా భాష పక్షం నడుస్తున్న సందర్భంగా ర్యాలీ నిర్వహించి దుకాణ దారులకు, వ్యాపార సముదాయాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం, జిల్లా శ్రమ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఒరియా అస్మితాలో భాగంగా ఒడియా భాషలో నామఫలకాలు రాయాలని ఒక చైతన్య పాదయాత్రను కలెక్టర్ బిజయ కుమార్ దాస్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలో అన్ని వ్యాపార సముదాయాలు, సంస్థలు తమ సైన్ బోర్డులు ఒరియా భాషలో రాయాలని జిల్లా లేబర్ ఆఫీసర్ భారతీ బెహరా అన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి హైస్కూల్ జంక్షన్, మార్కెట్, రాజవీధి మీదుగా పాదయాత్రను నిర్వహించారు. ఈ పాదయాత్రలో డి.ఐ.పి.ఆర్.ఓ. ప్రదీప్ గురుమయి, పురపాలక స్వస్థ్య కార్యకర్తలు, మహిళా గ్రూపులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు నివారించాలి



మాట్లాడుతున్న ప్రియదాస్



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

జయపురం: సమాజంలో భ్రూణ హత్యలు నివారించాల్సిన అవసరం ఉందని స్వచ్ఛంద సేవకురాలు ప్రియదాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని హెచ్‌ఎం అభిషేక్ కుమార్ భుయె అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదాస్ మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలు అంటే చిన్నచూపు పోవాలంటే ముందుగా అందరిలో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యనభ్యసించి, ఉత్తమంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పురుషాధిక్య సమాజంలో బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, అత్యాచారాలపై విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు అన్నపూర్ణ సుందరరాయ్, సంజుక్త మహరాణ, స్వర్ణలత మిశ్ర, సబితా కుమారి పటాన్యాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ – ముస్లింలను విడదీసే కుట్ర

• రాజ్యసభ సభ్యుడు మున్నా ఖాన్



రాజ్యసభలో ప్రసంగిస్తున్న ఎంపీ మున్నాఖాన్

కొరాపుట్: దేశంలో హిందూ – ముస్లింలను విడదీసే కుట్ర జరుగుతోందని బీజేడీ రాజ్యసభ ఎంపీ, ఒడియా సినీహీరో ముజిబుల్లా ఖాన్ (మున్నా ఖాన్) ఆరోపించారు. గురువారం రాత్రి పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. తన స్వస్థలం ఒడిశాలో నబరంగ్‌పూర్ జిల్లాలోని కుగ్రామం అన్నారు. తమ గ్రామంలో హిందువుల అమ్మవారి జాతరలు జరిగినప్పుడు తన కుటుంబ పెద్దలు ముందుంటారన్నారు. తమకు అక్కడ వేర్వేరు మతాలు అనే భావనలు ఉండవని పేర్కొన్నారు. ఒడిశాలోని ప్రతీ వ్యక్తి మతాలకు అతీతంగా జగన్నాథ స్వామివారిని నమ్ముతామని పేర్కొన్నారు. ఖుర్దా జిల్లాలో పవిత్ర రథయాత్రలో భాగంగా చెరాపొరని ఒక ముస్లిం నిర్వహిస్తాడని వెల్లడించారు. కానీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తన విధానాలతో ఇరుమతాల ప్రజల్లో అనేక భయాలు సృష్టిస్తోందని ధ్వజమెత్తారు. వక్ఫ్ బోర్డు మీద కేంద్ర ప్రభుత్వం పగ తీర్చుకుంటోందని విచారం వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఉద్యోగుల ధర్నా



ధర్నాలో సఫాయి కార్మికులు

మల్కన్‌గిరి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సఫాయి కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రారం ధార్న చేశారు. తమతో కలిసి పని చేసిన ఉద్యోగి కుటుంబానికి న్యాయం చేయాలని, కార్మికులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ ఫండ్ మంజూరు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు.

సమస్యల పరిష్కారంపై మున్సిపల్ చైర్మన్ దృష్టి



ప్రజల సమస్యలు వింటున్న చైర్మన్ రాజేంద్రపాత్రో

కొరాపుట్: నాయకుల వద్ద ప్రజలు స్వయంగా వెళ్తే గాని సమస్యలు పరిష్కారం కావడం లేదు. కానీ కొరాపుట్ జిల్లా సునాబెడా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రాజేంద్ర కుమార్ పాత్రో విభిన్న శైలి అవలంబించారు. తానే రోజుకొక వార్డుకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి పరిష్కరించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒకటో వార్డు పరిధి బాపూజీనగర్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. బోరింగ్ నీటిలో పురుగులు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన తక్షణమే కొత్త బోరు వేయించేందుకు హామీ ఇచ్చారు. అలాగే అక్కడ ఉన్న బావికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

వనదుర్గా మందిరంలో బుద్ధుని విగ్రహ ప్రతిష్ట

పర్లాకిమిడి:

స్థానిక దుర్గంపేటలో వనదుర్గా మందిరం ఆవరణలో శుక్రవారం బుద్ధుని విగ్రహాన్ని చంద్రగిరి టిబెటియన్ శరణార్థుల గురూజీ ఖెంపో పెమా ప్రతిష్టించారు. శాంతికి చిహ్నం బుద్ధుడు అని, ఈ ప్రాంతంలో బుద్ధ విగ్రహం ప్రతిష్టించడంతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోందని అన్నారు. తొలుత టిబెటియన్ మతగురు దలైలామా శిష్యులు లామా గెలక్, ఖెంపో పెమా గురూజీలను పట్టణంలో మార్కెట్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఊరేగించారు. అనంతరం కంచ్రవీధి వద్ద దుర్గంపేటలో నూతన వనదుర్గా మందిరం ఆవరణలో నిర్మించిన బుద్ధుని విగ్రహాన్ని మంత్రోచ్ఛరణ చేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ లామాలు తెసిరింగ్, బయాంగ్, లోపోన్ సోనమ్ గ్యంస్తో, నోర్బు, లోపోన్ పసాంగ్ దోర్జి మరో ఎనిమిదిమంది బౌద్ధ తీర్థాంకుల సహకారంతో మంత్రోచ్ఛరణ చేసి పవిత్ర జలాలను విగ్రహంపై జల్లారు. అనంతరం బుద్ధుని విగ్రహాన్ని లాంఛనంగా గురూజీ ఖెంపోపెమా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖెంపో పెమా గురుజీ, లామా గెలక్‌ను వనదుర్గా ఆలయ కమిటీ తరఫున బౌద్ధ చిత్రాన్ని బహుకరించి, దుశ్శాలువతో సత్కరించారు.



వనదుర్గామందిరం ఆవరణలో బుద్ధుని విగ్రహాన్ని టిబెటియన్ మత గురువు ఖెంపో పెమా, లామా గెలెక్ ప్రారంభిస్తున్న దృశ్యం



చంద్రగిరి టిబెటియాన్ మతగురువు ఖెంపో పెమాను సత్కరిస్తున్న వనదుర్గామందిరం కమిటీ



వనదుర్గామందిర ఆవరణలో బుద్ధుని విగ్రహం ఆవిష్కరించిన అనంతరం భక్తులతో లామా గెలెక్, ఖెంపో పెమా గురుజీ


దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు



పికప్ వ్యాన్లతో పట్టుబడిన నిందితులు

రాయగడ: ఇనుప రాడ్లను దొంగిలించి తీసుకువెళుతున్న మూడు పికప్ వ్యాన్‌లను అంబొదల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 38 ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకుకొని వారిని కోర్టుకు తరలించారు.

ఘనంగా దక్షిణ కాళీ నూతన మందిర ప్రతిష్టాపన



దక్షిణ కాళీ నూతన మందిరం



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూజార్లు

జయపురం: జయపురం బెహరా వీధిలో కొత్తగా నిర్మించిన దక్షిణ కాళీ మందిర రత్న ముద్ర స్థాపన, మందిర ప్రతిష్టాపన ఘనంగా జరిగియి. ఆలయ ప్రధాన పూజారి పండిత మనోరంజన్ దాస్ నేతృత్వంలో పూరీ పండిత భగవాన్ దాస్, శరత్ చంద్ర త్రిపాఠీ, రఘునాథ్ రథ్, ఖగేశ్వర దాస్, గంజామ్ జిల్లా పండిత ప్రశాంత కుమార్ దాస్ తదితరులు పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నప్రసాద సంతర్పణలో వేలాది మంది పాల్గొన్నారు.

ఆలయాల్లో యువకుల శ్రమదానం



ఐకాన్ ఇన్ మొషన్ సభ్యులు

కొరాపుట్: చైత్ర మాసం సందర్భంగా దేవాలయాలను యువత పరిశుభ్రం చేసింది. నబరంగ్‌పూర్ జిల్లాలో అనేక అవగాహన కార్యక్రమాలు చేస్తున్న ఐకాన్ ఇన్ మొషన్ స్వచ్ఛంద సంస్థకు చెందిన యువకులు జగన్నాథ, మహాలక్ష్మి దేవాలయాలను శుక్రవారం కడిగి సుందరంగా తయారు చేశారు. చైత్ర మాసంలో అమ్మవారి దేవాలయాలకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.



పరిశుభ్రం అనంతరం మహాలక్ష్మి దేవాలయం

క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ బాబా యుగంధర్, సహాయ అధికారి కిషోర్ పట్నాయక్‌లు ఈ కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సిరాజుద్దీన్ అహ్మద్, కార్యదర్శిగా తపన్ సింగ్, ఉపాధ్యక్షుడిగా సదాశివ సాహు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

పర్లాకిమిడిలో ఉపవాస దీక్షలు



అమ్మవారి ఊరేగింపు సందడి

పర్లాకిమిడి: చైత్రమాసం సందర్భంగా పర్లాకిమిడి పట్టణంలో మాకాళీ దోండోనటో ఉపవాస దీక్షలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. సాయంత్రం వేళ వివిధ వీధుల్లో గాలిదోండో, పాణిదోండో విన్యాసాలు కాళీ సాధకులు చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ వరకూ ఉత్సవాలు, సాంస్కృతి కార్యక్రమాలు జరుగనున్నాయి.

ఫైనల్స్‌లో పంజాబ్ లవ్లీ విశ్వవిద్యాలయం గెలుపు



లవ్లీ యూనివర్సిటీ విద్యార్థినికి ప్రశంసా పత్రం, మెమెంటో అందిస్తున్న ఉపకులపతి డాక్టర్ సుప్రియా పట్నాయిక్

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో జరుగుతున్న మూడో అఖిల భారత విశ్వవిద్యాలయాల స్టూడెంట్స్ పార్లమెంట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు సమావేశాలలో బహుమతి ప్రదాన సభకు ముఖ్యఅతిథిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని మాట్లాడారు. నేటి మహిళలు భాగస్వాములు మాత్రమే కాదు... మార్పునకు మార్గదర్శులు కూడా అని అన్నారు. నాలుగు రోజుల పాటు సాగిన వివిధ విశ్వవిద్యాలయాల గర్ల్ స్టూడెంట్స్ పార్లమెంటులో పంజాబ్ లవ్లీ యూనివర్సిటీ చాంపియన్స్‌గా నిలవగా, ద్వితీయ బహుమతి బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్సిటీ, సంత్‌గడ్గే బాబా అమరావతి విశ్వవిద్యాలయం తృతీయ బహుమతి గెలుచుకున్నారు. వారికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య డి.ఎన్.రావు, ఆంధ్రప్రదేశ్ సెంచూరియన్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.కె.మహంతి, వీసీ బిశ్వజిత్‌లు జ్యూరీ మెంబర్లుగా వ్యవహరించారు. భువనేశ్వర్ సెంచూరియన్ వర్సిటీ ఉపకులపతి డా. సుప్రియా పట్నాయిక్ బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్నారు.

రెండు కేజీల గంజాయితో ముగ్గురు అరెస్టు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో 2 కేజీల 140 గ్రాముల గంజాయితో ముగ్గురు వ్యక్తులను పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ బలియార్, అతని బావ మోహన్‌దాస్‌ప్రదాన్‌లు ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో గంజాయి వ్యాపారం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో లక్ష్మీకాంత్ గంజాయిని మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ప్రాంతంలో విక్రయించి వచ్చిన మొత్తాన్ని సమానంగా పంచుకునేవారు. ఈ క్రమంలో అక్కడి గంజాయి వ్యాపారి షాహాజి రామజాదవ్‌తో సికింద్రాబాద్‌లో పరిచయం ఏర్పడింది. తనకు కిలో గంజాయి అందజేస్తే రూ.7500 చెల్లిస్తానని చెప్పడంతో గంజాయి కొనుగోలు చేసి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్దకు వచ్చారు. వీరితో పాటు అక్కడికి వచ్చిన రామజాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మిస్టర్ ఆంధ్రా పోటీల్లో సిక్కోలు హవా

శ్రీకాకుళం న్యూకాలనీ: మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాకుళం బాడీబిల్డర్లు సత్తా చాటారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కవిటి చెందిన దుదిస్టీ మజ్జి 55 కేజీల విభాగంలో విజేతగా నిలిచారు. ఎస్.వైకుంతరావు(శ్రీకూర్మం) 60 కేజీల విభాగంలో 4వ స్థానం, కె.అవినాష్ (పలాస) తదితరులు రాణించారు. వీరిని భీమవరానికి చెందిన ఎమ్మెల్యే అంజిబాబు, సంఘ రాష్ట్ర అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్ బహుమతులు అందజేశారు. వీరిని శ్రీకాకుళం జిల్లా సెక్రటరీ కె.గౌరీశంకర్, అధ్యక్షులు తారకేశ్వర రావు, చీఫ్ పేట్రన్ డాక్టర్ బాడాన దేవభూషణ రావు, వడ్డాది విజయ్‌కుమార్, బలగ ప్రసాద్, సీనియర్ బాడీబిల్డర్లు, జిమ్ నిర్వాహకులు, కోచ్‌లు అభినందించారు.

అంబరాన్ని తాకిన సంబరం

- ప్రారంభమైన గ్రామ దేవత ఉత్సవాలు
- 26 రోజుల పాటు ఉత్సవ సందడి



గ్రామ దేవత బుడ్డి ఠాకురాణి



ఉత్సవంలో పాల్గొన్న అశేష జనవాహిని

బరంపురం: రెండేళ్ల తరువాత బరంపురం గ్రామ దేవత బుడ్డి ఠాకురాణి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది 26 రోజుల పాటు గ్రామ దేవత ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్టమైన భద్రత చేపట్టారు.



ఉత్సవంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు

వక్ఫ్‌తో బీజేడీ విభజన!

- అయోమయంలో బీజేడీ ప్రముఖులు

భువనేశ్వర్:

అనేక వాదోపవాదాలు, భిన్నాభిప్రాయాల మధ్య వక్ఫ్ (సవరణ) బిల్లు–2025 భారత పార్లమెంటులో మెల్లగా గట్టెక్కింది. కావాల్సిన సానుకూలత కూడగట్టుకుని ఎగువ సభ ఆమోదం పొందింది. దీని తదుపరి పరిణామాలతో రాష్ట్ర రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధానంగా బిజూ జనతా దళ్ (బీజేడీ) శిబిరంలో అతలాకుతల పరిస్థితి తాండవిస్తుంది. వక్ఫ్ సవరణ పట్ల దళం నిర్ణయం చిట్ట చివరి క్షణంలో ఊహాతీతంగా మలుపు తిరిగింది. రాజ్య సభలో స్వీయ విచక్షణతో వక్ఫ్ బిల్లు సవరణ పట్ల స్పందించాలని బీజేడీ జాతీయ అధికార ప్రతినిధి సస్మిత్ పాత్రొ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఓటింగుకు సంబంధించి అధిష్టానం ఎలాంటి విప్ జారీ చేయనట్లు స్పష్టం చేయడంతో బీజేడీ శిబిరంలో ఊహాతీత పరిస్థితులు తలెత్తాయి.

వక్ఫ్ బిల్లు సవరణ ఓటింగు సందర్భంగా బీజేడీ సభ్యులు ఎవరికి వారే యమునా తీరే చందాన ఓటు వేశారు. జాతీయ అధికార ప్రతినిధి మాత్రం బిల్లుకు అనుకూలంగా ఓటు వేసినట్లు బహిరంగపరిచారు. మరో ఆ పార్టీ సిటింగు రాజ్య సభ సభ్యుడు మున్నా ఖాన్ వ్యతిరేకంగా ఎదురు తిరిగినట్లు బయటకు పొక్కింది. మిగిలిన సభ్యుల పోకడ పట్ల సందిగ్ధత నెలకొంది. రాష్ట్రంలో రాజకీయ స్థితిగతుల దృష్ట్యా పార్లమెంటులో బీజేడీ వైఖరి జాతీయ స్థాయి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

వాస్తవానికి ఈ బిల్లు పట్ల చిట్ట చివరి క్షణం వరకు బీజేడీ వ్యతిరేకిస్తుందని అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ప్రకటించినట్లు పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ కార్యవర్గ సభ్యుల తదితర వర్గాలు నికరంగా ప్రకటించాయి. ఓటింగు సమయానికి అధిష్టానం నిర్ణయం ఆకస్మికంగా మారి త్రిశంఖు వైఖరితో ప్రత్యక్షం కావడం ఏమిటనే సందిగ్ధంతో పార్టీ ప్రముఖులు తలకిందులు అవుతున్నారు. ఈ నిర్ణయాన్ని తాము జీర్ణించుకోలేకపోతున్నామని బద్రి నారాయణ పాత్రో, డాక్టరు ప్రసన్నకుమార్ ఆచార్య వంటి ప్రముఖులు బాహాటంగా నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌ని సూటిగా నిలదీస్తామని బహిరంగ పరిచారు. సీనియర్ల వర్గం నవీన్ పట్నాయక్‌తో ముఖాముఖి చర్చించేందుకు నిరీక్షిస్తుంది. వక్ఫ్ బిల్లు పట్ల పార్టీ వైఖరి మార్పు ఆంతర్యం ఏమిటో నిగ్గు తేల్చుకుంటామని తొడగొడుతున్నారు. బీజేడీ రాజ్య సభ సభ్యుడు, జాతీయ అధికార ప్రతినిధి సస్మిత్ పాత్రో మాట్లాడుతూ.. ఎంపీలు తమ మనస్సాక్షి ప్రకారం ఓటు వేయాలని పార్టీ నిర్ణయించింది. ఎంపీల నిర్ణయంకే వదిలివేసినందున తాను బిల్లుకు మద్దతు ఇచ్చినట్లు తేటతెల్లం చేశారు.

రాజకీయ దుమారం

వక్ఫ్ బిల్లు పట్ల ఎగువ సభలో బిజూ జనతా దళ్ వైఖరి పట్ల రాష్ట్ర కాంగ్రెస్ మండి పడుతుంది. బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీ మధ్య కొనసాగుతున్న రాజకీయ అవగాహనపై అనుమానాలను తాజా వైఖరి బలోపేతం చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ రెండు పార్టీల మధ్య లోపాయికారీ పొత్తు చెక్కుచెదరకుండా కొనసాగుతుందని, వారు మాయలు చేసి రాష్ట్ర ప్రజలను సదా మోసం చేయలేరని, రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ మాత్రమే ప్రత్యామ్నాయంగా భరోసా ఇస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ సాంఘిక మాధ్యమంలో విస్తారంగా ప్రసారం చేస్తోంది. అయితే బీజేడీకి ఇదేమీ కొత్త కాదు. లోగడ పలు మార్లు కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారుకు అనుకూలంగా అండగా నిలిచి వివిధ విపత్కర పరిస్థితుల నుంచి సునాయాసంగా గట్టెక్కించింది.

శంఖ భవన్‌లో ఏమై ఉంటుంది..

శంఖ భవన్ విపక్ష బిజూ జనతా దళ్ ప్రముఖ కర్మ క్షేత్రంగా వెలుగొందుతుంది. వక్ఫ్ బిల్లుకు సంబంధించి ఈ భవనంలో పలు కీలక సమావేశాలు జరిగాయి. బిల్లు ఆమోదం తర్వాత శుక్ర వారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ప్రముఖులు, ప్రధాన చర్చనీయాంశాలు ఇతరేతర కీలక సమాచారం పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తొలుత బిల్లును వ్యతిరేకించమని పార్టీ అధ్యక్షుడు సభ్యుల్ని ఆదేశించారు. చివరి క్షణం మార్పు ఎలా జరిగిందోనని పార్టీ వర్గాలు సంభ్రమాశ్చర్యాలు వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ మనుగడ కోసం దక్షత కలిగిన నాథుడు లేకుంటే ఇలాంటి దయనీయ పరిస్థితులే వస్తాయని స్థానిక ఎమ్మెల్యే, భారతీయ జనతా పార్టీ సభ్యుడు బాబూ సింగ్ వ్యాఖ్యానించారు. ఇటువంటి వైఖరితో బీజేడీ తాజా సార్వత్రిక ఎన్నికల్లో లోక్ సభలో తన ఉనికిని పూర్తిగా కోల్పోయిందని ఉదహరించారు.

ఉత్సాహంగా ఒడియా భాషోత్సవాలు



ప్రత్యేక వస్త్రధారణలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో ఒడియా భాషా వారోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంప్రదాయ వస్త్రధారణ ప్రదర్శన ఆట్టుకుంది. జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ సంబల్‌పూరీ వస్త్రాలతో అలరించారు. మన దుస్తులే మనకు గౌరవం, గుర్తింపు కావాలని కలెక్టర్ అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్‌ప్రధన్, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధన్, జిల్లా అభివృద్ధి అధికారి నరేశ్ చంద్రశఖర, డీఐపీఆర్‌వో ప్రమిళ మార్కి ఉన్నారు.

సేవాయత్‌ల ఉత్తమ ప్రవర్తనకు శిక్షణ



శిక్షణ శిబిరంలో శ్రీ మందిరం సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి ప్రసంగం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ మందిరం సేవకులు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ దేవస్థానం దైనందిన కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్న సేవాయత్ వర్గానికి ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. స్థానిక నీలాద్రి భక్త నివాస్‌లో 2 రోజుల పాటు కొనసాగనున్న సేవకుల శిక్షణ శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ, పూరీ జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంటు సమక్షంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవకునికి ఉన్నత లక్షణాలను వివరిస్తు ప్రధాన అంశాల్ని సీఏఓ ప్రస్తావించారు. అన్ని వర్గాల సేవకులకు ఉండాల్సిన 10 ప్రధాన అంశాలను ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణ, సదస్సు ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు కొనసాగుతుంది. ఈ శిబిరంలో వివిధ అంశాలపై చర్చలు ఉంటాయని పేర్కొన్నారు.

రాజధాని స్థాపన దినోత్సవానికి సన్నాహక సమావేశం



సన్నాహక సమావేశంలో అధికారులు

భువనేశ్వర్: రాజధాని స్థాపన దినోత్సవం ఈ నెల 13, 14 తేదీల్లో వరుసగా రెండు రోజులు జరుపుకోనున్నారు. కార్యక్రమం జయప్రదం చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇటీవల ముగిసిన ఉన్నత స్థాయి సమావేశం తీర్మానాల వాస్తవ కార్యాచరణకు సంబంధించి శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక క్యాపిటల్ ఉన్నత పాఠశాల సమావేశం హాలులో అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రుద్ర నారాయణ్ మహంతి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ ఏడాది రాజధాని స్థాపన దినోత్సవం వైభవంగా ఆకర్షణీయ ప్రదర్శనలతో జరుపుకోవాలని నిర్ణయించారు. విద్యార్థుల కవాతు కళాశాల స్థాయికి పరిమితం చేశారు. ఈ సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించాలని ఉత్సవ నిర్వాహక మండలి నిర్ణయించింది. రాష్ట్రంలో వేసవి వేడిని దృష్టిలో ఉంచుకుని పరేడ్ బ్యాండ్‌లు ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులకు మాత్రమే పరేడ్‌లో పాల్గొనేందుకు అనుమతించనున్నారు. మన రాజధాని శీర్షికపై పాఠశాల, కళాశాల విద్యార్థుల మధ్య వివిధ నృత్య, పాటల పోటీలు నిర్వహిస్తారు. స్థానిక రవీంద్ర మండపంలో ఈ పోటీలు జరుగుతాయని ప్రకటించారు. రాజధాని నగరం స్థాపన దినోత్సవం పురస్కరించుకుని వరుసగా రెండు రోజులు సాయంత్రం స్థానిక ఉత్కళ్ మండపంలో సదస్సు, చర్చ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సమావేశంలో రాజధాని స్థాపన దినోత్సవ నిర్వాహక కమిటీ చైర్మన్ ప్రదోష్ పట్నాయక్, భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఎంసీ సహాయ కమిషనర్ కె. గణేష్, మాధ్యమిక విద్యా విభాగం సహాయ డైరెక్టర్ హిమాన్షు శేఖర్ బెహరా, భువనేశ్వర్ మండల విద్యాధికారి బీఈఓ డాక్టర్ ప్రజ్ఞా పరమిత జెనా, ఖుర్దా మండల విద్యాధికారి బీఈఓ సంధ్యారాణి రౌత్, క్యాపిటల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ అనుపమ మంగరాజ్, క్యాపిటల్ ఫౌండేషన్ డే కమిటీ వైస్ చైర్మన్ ప్రద్యుమ్న కుమార్ మహంతి, ప్రధాన కార్యదర్శి సనత్ మిశ్రా, వివిధ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పర్థలకు తెర



నవీన్ పట్నాయక్‌తో సలహా కమిటీ సభ్యుల సమావేశం

భువనేశ్వర్: రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పురస్కరించుకుని బిజూ జనతా దళ్ బీజేడీ వర్గాల్లో చెలరేగిన స్పర్థలకు అధ్యక్షుడు, విపక్ష నేత నవీన్ పట్నాయక్ సున్నితంగా తెర దించేశారు. పార్టీలతో సమాన దూర విధానం–లౌకికవాదానికి కట్టుబడి ఉండాలనే మార్గదర్శకం నేపథ్యంలో వక్ఫ్ సవరణ బిల్లు వ్యవహారంలో పార్టీ వైఖరి కొనసాగిందని ఆయన తేటతెల్లం చేశారు. రాజ్యసభలో వక్ఫ్ బిల్లు ఆమోదం పురస్కరించుకుని బీజేడీ ప్రముఖుల్లో తలెత్తిన తీవ్ర అసంతృప్తి సెగలు నవీన్ పట్నాయక్‌తో ప్రత్యక్ష చర్చల్ని ప్రేరేపించాయి. ఈ పరిస్థితుల్లో బీజేడీ సలహా కమిటీ సభ్యులు శుక్రవారం సాయంత్రం పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌ను కలిసి ముఖాముఖి మాటామంతీ చేశారు. అనంతరం బీజేడీ వైఖరిని సీనియర్ నాయకుడు డాక్టరు ప్రసన్న కుమార్ ఆచార్య స్పష్టం చేశారు. పార్టీ గతంలో సమస్యల ఆధారిత మద్దతు ఇచ్చిన సందర్భాలు, పరిస్థితుల్ని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా ఆ విధానంలో ఎలాంటి మార్పు లేకుండా పార్టీ వైఖరి కొనసాగిందని ప్రసన్న ఆచార్య వివరించారు.

సంస్థాగత అంశాలపై చర్చలు

బిజూ జనతా దళ్ సంస్థాగత అంశాలపై చర్చలకు నవీన్ పట్నాయక్ ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో బిజూ జనతా దళ్ (బీజేడీ) సలహా కమిటీ సభ్యులు పార్టీ ప్రధాన కార్యాలయం శంఖ భవన్‌లో ముందస్తుగా నిర్ధారించిన సమావేశాలు తరచూ క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. అనంతరం నిత్యం సాయంత్రం వేళలో అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌తో సమావేశమై తాజా స్థితిగతుల్ని వివరిస్తున్నారు. ఈ రీతిలో శుక్రవారం జరిగిన సలహా కమిటీ సభ్యుల సమావేశంలో వక్ఫ్ బిల్లుపై రాజ్యసభలో మనస్సాక్షి ఓటు ప్రధాన శీర్షికగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో కొనసాగుతున్న సంస్థాగత ఎన్నికలను పూర్తి చేయడం వంటి ముఖ్యమైన విషయాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షులను ఎన్నుకోవడానికి శనివారం నుంచి వరుస సమావేశాలను ఏర్పాటు చేసే ప్రక్రియలో అంతా హడావిడిగా ఉన్నారు. ప్రతి ఉదయం శంఖ భవన్‌లో సలహా కమిటీ సభ్యులు సమావేశమై నిత్యం సాయంత్రం తమ నిర్ణయాల గురించి నవీన్ పట్నాయక్‌కు తెలియజేస్తున్నారని విశ్వసనీయ సమాచారం.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కేశవరావుపేట పంచాయతీ కింతలి మిల్లు కూడలి వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. విజయనగరం జిల్లా రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఈయన ద్విచక్ర వాహనంపై చిలకపాలెం వైపు వెళ్తుండగా.. కింతలి మిల్లు సమీపంలో పంక్చర్ కావటంతో ఆగి ఉన్న లారీని ఢీకొట్లాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన రామకృష్ణను 108 అంబులెన్సు ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేయగా.. ఆస్పత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటబొమ్మాళి మండలానికి చెందిన సీహెచ్ రవి, డి.ప్రసాద్‌లు ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారి పక్కగా ఉన్న కల్వర్టులోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో బైకుపై ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

టెక్కలిని మున్సిపాలిటీగా మారుస్తాం

- మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి/సంతబొమ్మాళి: జిల్లా కేంద్రానికి ధీటుగా టెక్కలిని అభివృద్ధి చేస్తామని.. అయితే పంచాయతీగా ఉంటే సాధ్యం కాదు కాబట్టి దశల వారీగా మున్సిపాలిటీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. సుమారు రూ.1.43 కోట్ల అంచనా వ్యయంతో టెక్కలి–చెట్లతాండ్ర రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా మార్గంలో పర్యటించే క్రమంలో చిరు వ్యాపారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఇక్కడే జీవనోపాధి చేస్తున్నామని ఇప్పుడు రోడ్డు విస్తరణతో రోడ్డున పడతామని వాపోయారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పిస్తామన్నారు. టెక్కలిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ప్రజలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబంలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామన్నారు. అంతకుముందు టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నూతన బస్సులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, ఆర్అండ్‌బీ ఎస్ఈ కె.జాన్ సుధాకర్, టీడీపీ నాయకులు కె.హరివరప్రసాద్, బి.శేషగిరి, కె.లవకుమార్, ఎం.దమయంతి, ఎం.రాము, ఎల్.శ్రీనివాస్, కె.కామేష్, ఆర్ అండ్ బీ అధికారులు డీఈ రవికాంత్, జేఈ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడు వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న స్థానికులు

హమ్మయ్యా..

పెను ప్రమాదం తప్పింది!



డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

- హైవేపై రెండు కార్లు ఢీ
- చిన్నారికి గాయాలు.. క్షేమంగా బయటపడిన తల్లిదండ్రులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్ల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారికి స్వల్ప గాయాలు కాగా, ఆమె తల్లిదండ్రులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసింహమూర్తి అనే ఉపాధ్యాయుడు విధులు ముగించుకుని శ్రీకాకుళంలోని పీఎన్ కాలనీలోని తన నివాసానికి కారులో వెళ్తున్నారు. అదే సమయంలో ఒడిశా వైపు వెళుతున్న కారు కొయ్యరాళ్ల సమీపంలోకి వచ్చేసరికి అదుపు తప్పి ఉపాధ్యాయుడి కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో టీచర్ కారు డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఒడిశా వైపు వెళ్తున్న కారులో చిన్నారి లిఖితకు స్వల్ప గాయాలయ్యాయి. భార్యాభర్తలకు ఎటువంటి గాయాలు కాలేదు. ఎచ్చెర్ల ఎస్సై సందీప్‌కుమార్ ఘటనా పరిశీలించారు. చిన్నారిని ఆస్పత్రిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.



దెబ్బతిన్న మరో కారు



గాయపడ్డ చిన్నారి లిఖిత

క్లుప్తంగా

అట్రాసిటీ కేసు దర్యాప్తు



మెంటిపేట కాలనీలో మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు దర్యాప్తును చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం రాజాం పట్టణ పరిధి మెంటిపేట ఎస్సీ కాలనీలోని సంఘటనా స్థలానికి చేరుకుని సాక్షులను వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ తమను కులంపేరుతో దూషించాడని పక్కి వెంకన్నదొర, మమతబెనర్జీలు ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనకు సంబంధించి సాక్షులను విచారించి దర్యాప్తు అంశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు సీఐ కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఎస్టీ కులధ్రువీకరణపై విచారణ

సీతంపేట: బోగస్ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్నారనే ఆరోపణలపై శుక్రవారం సీతంపేట ఐటీడీఏలో పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి విచారణ చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని విచారణ చేసి ఆధారాలు పరిశీలించారు. పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, సూపరింటెండెంట్ దేశ్, హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ రన్నింగ్ పైపులు ధ్వంసం



గొల్లాది పొలంలో ధ్వంసమైన వాటర్ పైపులు

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామంలో బోరు నుంచి సాగు నీటిని పొలానికి పంపిణీ చేసే తెల పైపులను దుండగులు ధ్వంసం చేయడం దురదృష్టకరమని బాధితరైతు బంటు ప్రసాదరావు వాపోయాడు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమ బోరునుంచి సాగునీటిని పొలాల్లో సాగుచేస్తున్న పంటలకు తీసుకెళ్లేందుకు అమర్చుకున్న తెల్ల ప్లాస్టిక్‌పైపులను గుర్తు తెలియని దుండగులు ముక్కలు ముక్కలుగా నరికివేసి ధ్వంసం చేశారని చెప్పాడు. సుమారు రూ.15వేల విలువ కలిగిన పైపులను పనికి రాకుండా ముక్కలు చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేసి వారికి తగిన బుద్ధిచెబుతానని ఆవేశంతో చెప్పాడు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మా ఉద్యోగి మృతి





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమణారావు, (ఇన్‌సెట్లో) రమణారావు(ఫైల్)

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫార్మా ఉద్యోగి బగాది రమణారావు(40) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, సంతకవిటి మండలం, జి.ఎన్.పురం గ్రామానికి చెందిన రమణారావు అచ్యుతాపురంలో అద్దెకు నివాసముంటూ పరవాడలోని ఓ ఫార్మా పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఏ షిఫ్ట్‌కు వెళ్లేందుకు ఆయన బైక్‌పై కూడలికి చేరుకున్నారు. యలమంచిలి రోడ్డు నుంచి అనకాపల్లి వైపు మలుపు తిరుగుతున్న సమయంలో బైక్‌పై వెళ్తున్న రమణారావును లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు జరిగిన దుర్ఘటనపై విచారణ చేపట్టి సీఐ నమ్మి గణేష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రొంగలి రాము మాట్లాడుతూ మృతి చెందిన రమణారావు కుటుంబానికి లారీ యజమానితో పాటు పరిశ్రమ యాజమాన్యం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నేవీ ప్రాజెక్ట్ లారీలు ఎటువంటి అనుమతులు లేకుండా అనకాపల్లి, అచ్యుతాపురం రహదారిలో యథేచ్ఛగా తిరుగుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. లారీల యాజమానులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధార్‌తో జాగ్రత్త

- అప్‌డేట్‌లో ఇబ్బందులు పడొద్దు
- ఆన్‌లైన్ అపడేట్ లింకులు ఆశ్రయిస్తే ప్రమాదమే
- మూడు పర్యాయాలు దాటి అప్‌డేట్ చేస్తే ఆధార్ రద్దు
- తప్పుల తడకలతో పాత ఆధార్ కార్డులు
- అప్‌డేట్ నిమిత్తం సైబర్‌నేరగాళ్లకు చిక్కుతున్న ప్రజలు



రాజాం: ఆధార్ కార్డుతో ప్రజలు ఇప్పుడు తిప్పలు పడుతున్నారు. పదేళ్లు దాటిన తరువాత ఆధార్ అప్‌డేట్ చేయాలని, తప్పులు తడకలు ఉంటే సరిదిద్దుకోవాలని, పింఛన్ కోసం మార్పులు చేర్పులు చేసుకోవాలని ప్రజలు తరచూ ఆధార్ కేంద్రాలకు ఇటీవల పరుగు పెడుతున్నారు. దేశమంతా ఒకే ఐడెంటిటీ ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం యునిక్ ఐడింటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ)ద్వారా ఆధార్ కార్డులు మంజూరుచేసింది. కార్డులు కొత్తగా వచ్చిన సందర్భంలో వాటిపై పెద్దగా ప్రజలకు అవగాహన లేకపోవడంతో తప్పుల తడకలతో ఆధార్ కార్డులు మంజూరయ్యాయి. ఇప్పుడు వాటిని సరిచేసుకోవడం, సరవణలు చేయడం ప్రజలు చేస్తున్నారు. ఇలా అప్‌డేట్ చేసుకునే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



రాజాంలోని ఆధార్‌సెంటర్‌లో అప్‌డేట్ నిమిత్తం రద్దీ

సైబర్ నేరాగాళ్లతో ప్రమాదం

ఇటీవల సైబర్ నేరగాళ్లు అధికమయ్యారు. ఆధార్ నంబర్ తెలిస్తే చాలు మొత్తం డేటాను మాయం చేయడంతో పాటు బ్యాంకు ఖాతాల్లోని నగదు దోచేస్తున్నారు. ప్రధానంగా ఆధార్ అప్‌డేట్ నిమిత్తం, సవరణల నిమిత్తం యూట్యూబ్‌లో అధికంగా ఫేక్ వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి. వాటిని నమ్మి కొంతమంది తమ ఆధార్ వివరాలతో పాటు ఫింగర్ ప్రింట్స్ ప్రెజెంట్ చేయడంతో వారి బ్యాంకు ఖాతాలు మాయమవుతున్నాయి. ఇలా ఇటీవల నియోజకవర్గంలో ఆరుకు పైగా సైబర్ నేరాలు వెలుగులోకి వచ్చాయి.

ఓటీపీ పేరుతో మోసం

ఆధార్ అప్‌డేట్‌తో పాటు ఉచితంగా లోన్స్ ఇస్తున్నామని, పథకాలు అందిస్తామని, కొత్త ఆధార్ కార్డులు మంజూరయ్యాయంటూ ఫేక్‌కాల్స్ వస్తున్నాయి. వాటిని నమ్మి ఓటీపీలు చెబితే ఆధార్‌కార్డు ఆధారంగా ఉన్న బ్యాంకుల్లోని నగదు మాయమవుతోంది. అంతేకాకుండా ఆధార్‌కార్డు కూడా సీజ్ అవుతుంది. వాటికి తోడు ఇటీవల కొంతమంది ఆధార్ అప్‌డేట్ నిమిత్తం ఇంటి నుంచి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదుచేస్తుండడంతో ఆధార్ కార్డులు కోల్పోతున్నారు.

మూడు పర్యాయాలు దాటితే..

రాజాం నియోజకవర్గం మొత్తంలో 11చోట్ల ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. పలు మండలాల్లో అప్పుడప్పుడు ఆధార్ డ్రైవ్‌లను మండలపరిషత్ అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆధార్ కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులతో పాటు ప్రజలకు మూడు పర్యాయాలు మాత్రమే తమ ఆధార్ కార్డులోని వివరాలు సవరించేందుకు ఒక్కో విడతలో అవకాశం ఇస్తుంది. ఇందులో ప్రధానంగా జనన ధ్రువీకరణపై మరింత నిబంధనలు ఉన్నాయి. వీటిపై అవగాహనలేని ప్రజలు పదేపదే సవరణలు చేయడంతో ఆధార్ కార్డులు క్యాన్సిల్ అవుతున్నాయి. ఇలా ఇటీవల నియోజకవర్గంలో 123 మంది ఆధార్ కార్డులు క్యాన్సిల్ అయినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. వాటిని తిరిగిపొందేందుకు వారంతా విశాఖపట్నంలోని ఆధార్ కేంద్రానికి పరుగుపెట్టాల్సి వస్తోంది. అక్కడికి రెండు నుంచి నాలుగు పర్యాయాలు తిరిగితే తప్ప ఆధార్ మంజూరు కాని పరిస్థితి ఉంది.

తెలిసిన కేంద్రాల వద్దే అప్‌డేట్ చేయాలి



ఆధార్ కార్డుల అప్‌డేట్ ఎప్పటికప్పుడు చేయరాదు. తెలిసిన కేంద్రాల వద్ద మాత్రమే వాటిని అప్‌డేట్ చేయించుకోవాలి. వాటికి కూడా జనన ధ్రువీకరణల సవరణలు, పేర్ల సవరణ, అడ్రస్ మార్పు వంటివాటికి సంబంధించి కొంతవరకూ మాత్రమే అవకాశం ఉంటుంది. ఆయా అవకాశాలు దాటి పదేపదే ఆధార్ అప్‌డేట్ చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఆధార్ కార్డులు కోల్పోయే ప్రమాదం ఉంది. ఆన్‌లైన్ యాప్‌లు, ఓటీటీలు నమ్మొద్దు. ఇటీవల ఇటువంటి కేసులు రాజాంలో అధికంగా ఉన్నాయి. రాజాంకు కొత్త ఆధార్ సెంటర్ మంజూరుకు ప్రతిపాదనలు పెట్టాం.

– ఎస్‌కే రాజు, తహసీల్దార్, రాజాం

ఎస్టీజీ పరీక్షకు ఉచిత శిక్షణ

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి అప్పన్న



జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఇ.అప్పన్న

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్షకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఇ.అప్పన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తరగతులను నిర్వహిస్తామని పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు దరఖాస్తు చేయనున్న అభ్యర్థులు డిగ్రీ మార్క్స్ లిస్ట్, కుల, ఆదాయ, స్థానికత తెలిపే ధ్రువీకరణ పత్రాలు, డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు టీఈటీ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) మార్క్స్ లిస్ట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు ధరఖాస్తుతో జత చేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయం, ఆర్‌సీఎం స్కూల్, రూం నంబర్.8 మొదటి అంతస్తు, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా, పార్వతీపురం మన్యం నందు సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 9701786751, 9700112711ను సంప్రదించాలని సూచించారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ఉచిత శిక్షణ

విజయనగరం టౌన్: ఏపీ డీఎస్సీ ఎస్టీటీ, స్కూల్ అసిస్టెంట్స్ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని గురజాడ అప్పారావు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.పెంటోజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 11వ తేదీ లోగా కస్పా హైస్కూల్ వద్ద ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) వర్గాలకు చెందిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 9603557333, 9177726454 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ టీచర్లకు ఇన్‌సర్వీస్ స్టడీస్ అవకాశం ఇవ్వాలి

- ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు ఎస్టీయూ వినతి



వినతిపత్రం అందుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ఉన్నత విద్య చదవడానికి ప్రభుత్వం అవకాశాలను కొనసాగించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పదోన్నతుల కోసం ఉన్నత విద్య అభ్యసనకు జీఓ నంబర్ 342 ద్వారా అవకాశం ఉన్నప్పటికీ స్కూల్ అసిస్టెంట్‌లకు అవసరమైన ఎంఈడీ కోర్సులు చేయడానికి మాత్రం ప్రభుత్వం అవకాశం కల్పించడం లేదని ఈ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. దీని వల్ల ఎస్సీ ఎస్టీ టీచర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై ఛైర్మన్ స్పందిస్తూ ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఛైర్మను కలిసిన వారిలో ఎస్టీయూ సీనియర్ నాయకులు వి.గోవిందరావు, ఎస్ఎస్‌దొర, డి.శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

బదిలీలపై ఎస్పీకి సిబ్బంది మొర



సిబ్బంది నుంచి విన్నపాలు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: తాము పని చేస్తున్న దగ్గర ఎదరవుతున్న ఇబ్బందులను, అలాగే బదిలీల గురించి ఎస్పీకి హెచ్‌సీలు, కానిస్టేబుల్స్ మొర పెట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వృత్తిపరమైన, శాఖాపరమైన అంశాలను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శాఖ పరంగా దాదాపు ఎనిమిది మంది సిబ్బంది తమకు బదిలీలు చేయాలని విన్నవించుకున్నారు. భార్యాపిల్లలు వేరే చోట తాము వేరే చోట పని చేస్తున్నామని, కుటుంబానికి దగ్గరగా ఉండేలా బదిలీ కావాలని కోరారు. సిబ్బంది చెప్పిన విషయాలను ఎస్పీ స్వయంగా విని పుస్తకంలో రాసుకున్నారు. వెంటనే మినిస్టీరియల్ సూపరెంటెండెంట్‌ను పిలిచి సిబ్బంది అడిగిన అంశాలలో సాధ్యాసాధ్యాల గురించి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో శాఖ పరంగా పరిశీలించి అవసరమైన తగు చర్యలు చేపడతానని సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందల్ సిబ్బందికి హామీ ఇచ్చారు.

పంచాయతీ వనరుల కేంద్రం సిద్ధం కావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



స్థల పరిశీలచ చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లా ప్రధాన కేంద్రంలో ఏర్పాటు కానున్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్రాన్ని వీలైనంత త్వరగా పూర్తిచేసి సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం పక్కన రూ.200 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం స్థలాన్ని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే జిల్లాలో వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా ఉంటుందని, అదేవిధంగా ఇతర ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించుకోవచ్చని పంచాయతీ రాజ్‌శాఖ ఇంజినీర్లకు కలెక్టర్ స్పష్టం చేశారు. అందుకే వీలైనంత త్వరగా భవన నిర్మాణ పనులను ప్రారంభించి అప్పగించాలని సూచించారు. ఏడాదిలోగా భవనం పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ, ఈ ఏడాది చివరి నాటికి భవనాన్ని నిర్మించి అందించాలని కలెక్టర్ ఆదేశించారు. తొలుత భవన నిర్మాణ స్థలాన్ని సందర్శించి, గదుల మార్కింగులను పరిశీలించిన ఆయన భవన నిర్మాణ వివరాలను సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు పంచాయతీ రాజ్ శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వి.సన్యాసిరావు, మండల ఇంజినీరింగ్ అధికారి గంటా చంద్రమౌళి, ఎస్ఎస్. లాజిస్టిక్స్ కాంట్రాక్టర్ సురేష్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు బెట్టింగ్‌రాయుళ్ల అరెస్ట్

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లిలోని ఒక ఇంటిలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ప్రధాన వ్యక్తులు ఇద్దరితో పాటు మరో 5గురు వ్యక్తులను శుక్రవారం అదుపులోనికి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఫోన్లలో ఉన్న ఆధారాల ప్రకారం పట్టుకున్న నిందితులు ఎవరితో..ఎంత మొత్తాల్లో బెట్టింగ్‌లు నిర్వహించారో దర్యాప్తు నిర్వహిస్తున్నామని తెలిపారు.

గజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి కూడలి వద్ద గర్భాం రోడ్డులో గురువారం పెదమానాపురం ఎస్సై జయంతి సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 16.1కేజీ గంజాయిని ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గజపతినగరం సీఐ జీఏవీ రమణతో కలిసి ఆమె మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రం జాలోర్ జిల్లా, చైల తహీల్ గ్రామానికి చెందిన సురేష్ కుమార్ పురోహిత్, గోపాల్ పురోహిత్‌లు, అలాగే ఒడిశాలోని పొట్టంగి పోలీస్‌స్టేషన్ పరిధి కురియలపాడు గ్రామానికి చెందిన జన్ని అప్పన్న, మజ్జి అప్పరావు, జన్ని అప్పన్నలను ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇందులో మరికొంత మంది అనుమానితులు ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకోనున్నామన్నారు. గంజాయి తరలిస్తున్న వారిని వెంబడించి పట్టుకున్న ఎస్సై జయంతిని ఎస్పీ వకుల్ జిందల్ అభినందించినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సత్తిబాబు మృతదేహం

వేపాడ: మండలంలోని వీలుపర్తి క్వారీలో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు పడిపోవడంతో గాయాలపాలై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. ఇందుకు సంబంధించి వల్లంపూడి ఎస్సై బి.దేవి అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామానికి చెందిన సీహెచ్ సత్తిబాబు(54) వీలుపర్తి క్వారీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి కాలకృత్యాలకు వెళ్లిన సత్తిబాబు రాళ్ల గుట్టపై నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి గాయాలపాలయ్యాడు. దీంతో అక్కడే ఉన్న తోటి కార్మికులు విశాఖ తరలించి కేజీహెచ్‌లో చేర్పగా చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయినట్లు మృతుడి కుమారుడు సీహెచ్.రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించినట్లు ఎస్సై బి.దేవి తెలిపారు. మృతిచెందిన సత్తిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాసరావు మృతదేహం

గజపతినగరం రూరల్: అప్పుల బాధ/తాళలేక ఆత్మహత్యాయ యత్నం చేసిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం గ్రామానికి చెందిన కురింబిల్లి శ్రీనివాసరావుకు గజపతినగరం మండలం కాళంరాజుపేట గ్రామానికి చెందిన ఈశ్వరితో 15ఏళ్లక్రితం వివాహం జరిగింది. శ్రీనివాసరావు టైల్స్ వ్యాపారం చేస్తూ తెలిసిన వారందరి వద్ద అప్పులుచేసి ఒత్తిడికి గురయ్యేవాడు. అయితే ఈనెల 2వ తేదీన భార్యను కాళంరాజుపేట గ్రామంలో విడిచిపెట్టి మండలంలోని మధుపాడ గ్రామ సమీప మామిడితోటలో పురుగు మందు తాగేసి చనిపోతున్నట్లు అందరికీ సమాచారం అందించాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికా విద్యకు బాసట కేజీబీవీ



కేజీబీవీ పాఠశాల

నోటిఫికేషన్ ముఖ్య తేదీలు:	
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం	మార్చి 22, 2025
స్వీకరణ చివరి తేదీ :	ఏప్రిల్ 11, 2025
ప్రిపరేషన్ ఆఫ్ సెలక్షన్ జాబితా :	ఏప్రిల్ 16, 2025
వెరిఫికేషన్ :	ఏప్రిల్ 16 నుంచి 18 వరకు
ఎంపికైన విద్యార్థుల జాబితా :	ఏప్రిల్ 21
సర్టిఫికెట్ల పరిశీలన :	ఏప్రిల్ 21 నుంచి 25 వరకు

- వాటి లక్ష్యం..పెళ్లి కంటే చదువే ముఖ్యం
- జిల్లాలోని 26 విద్యాలయాల్లో 1,040 మందికి అవకాశం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి: డీఈఓ



తరగతి గదిలో బాలికలు

విజయనగరం అర్బన్: పేదరికంతో చదువు మాన్పిస్తారు. ఇంట్లో ఖాళీగా ఉందని పనికి పంపిస్తారు. ఆ తర్వాత బాల్య వివాహం చేస్తారు. చిన్నారుల బంగారు భవిష్యత్తును చీకటి మయం చేస్తారు. పేద కుటుంబాల ఆడపిల్లలను ఈ దుస్థితి నుంచి దూరం చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి హయాంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) వ్యవస్థను ఏర్పాటు చేశారు. అనాథ పిల్లలు, సెమీ అనాథ పిల్లలు, పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లలకు భద్రమైన పౌష్టికాహారం అందిస్తూ చదువు చెప్పేందుకు వాటిని నెలకొల్పారు. ఒకసారి ఆరవ తరగతిలో చేరితే ఇంటర్మీడియట్ వరకూ చదువుకునే మహోన్నత అవకాశాన్ని ఇవి కల్పిస్తున్నాయి. గత ఐదేళ్ల నుంచి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన అందిస్తున్నాయి. దీంతో వీటిలో ప్రవేశాలకు ఏటేటా డిమాండ్ పెరుగుతోంది. సాధారణ విద్యతోపాటు ఒకేషనల్, కంప్యూటర్ విద్యను సైతం ఇక్కడ అందిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనతోపాటు ఉచిత భోజనం, వసతి, పుస్తకాలు, యూనిఫాం తదితర సౌకర్యాలు అందిస్తున్నాయి.

ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

జిల్లాలోని 27మండలాల్లో 26 మండల కేంద్రాల కేజీబీవీల్లో విద్యార్థినుల ప్రవేశాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. వాటిలో 6వ తరగతిలో ప్రవేశానికి గత నెల 27వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ప్రతి పాఠశాలలో 6వ తరగతికి 40 సీట్లు ఉన్నాయి. అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 1,040 సీట్లు కేటాయించారు. వాటికి ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 7, 8 తరగతుల్లో ఖాళీలను బట్టి సీట్లు కేటాయిస్తారు. జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో ఒక్కో కోర్సుతో ఇంటర్మీడియట్ విద్యను కొనసాగిస్తున్నారు.

ప్రాధాన్యం మేరకు ప్రవేశ సీటు కేటాయింపు

అనాథ బాలికలు, సింగిల్ పేరెంట్, పేద పిల్లలతోపాటు బడి బయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిడువన ఉన్న బాలికలకు తొలి ప్రాధాన్యం కింద కేజీబీవీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వలస కూలీల చిన్నారులు, కార్మిక శాఖ అధికారులు సిఫార్సు చేసిన వారికీ ప్రవేశాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. రాష్ట్ర స్థాయిలో స్క్రూటినీ అనంతరం ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైన సమాచారం విద్యార్థి మొబైల్‌కు వస్తుంది. మహిళా అక్షరాస్యత రేటు తక్కువగా ఉన్న మండలాలకు చెందిన విద్యార్థినులకు ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు భర్తీ కాకపోతే పక్కజిల్లాల పరిధిలో ఉన్న మహిళా అక్షరాస్యత రేటు తక్కువ ఉన్న మండలాల విద్యార్థినులకు అవకాశం ఇస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



కేజీబీవీల్లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుదారులు నేరుగా కాకుండా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల గడువు ముగియగానే పరిశీలన చేసి ప్రవేశాన్ని నిర్ణయిస్తాం. పేద విద్యార్థినులకు కేజీబీవీలో విద్య మంచి అవకాశం. చదువు, ఆటపాటల్లో కేజీబీవీ విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధిస్తున్నారు.–యూ.మాణిక్యం నాయుడు, డీఈఓ

విద్యతోనే బాలికా వికాసం



కేజీబీవీలు ఏర్పడిన నాటి నుంచి లక్ష్యాలను సాధిస్తూ ముందుకెళ్తున్నాయి. 26 విద్యాలయాలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ మీడియట్ తరగతులు కూడా బోధిస్తున్నందున పేద వర్గాల బాలికలకు ఎంతో ఉపయోడపడుతున్నాయి. ఈ క్రమంలో వృత్తి విద్యాకోర్సులు కూడా జీవన నైపుణ్యాలను ఉపకరిస్తున్నాయి.

–డాక్టర్ ఎ.రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ

రియల్ ఎస్టేట్ కోసం రోడ్డును తవ్వేశారు!

- ఆందోళనకు దిగిన గిరిజనులు
- వెనుదిరిగిన లే అవుట్ సిబ్బంది



రోడ్డు తవ్వకాలను అడ్డుకున్న చీడిపాలెం గిరిజనులు

శృంగవరపుకోట: ఓ ప్రైవేటు లే అవుట్ కోసం ఎస్.కోట మండలం ముషిడిపల్లి పంచాయతీలో చినఖండేపల్లి నుంచి చీడిపాలెం వెళ్లే రోడ్డును పొక్లెయిన్, జేసీబీతో శుక్రవారం తవ్వేశారు. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్కూల్ పిల్లల ఆటో వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. దశాబ్దాల తరబడి గిరిజనులు రాకపోకలు సాగిస్తున్న రోడ్డును ఎలా తవ్వేస్తారంటూ లే అవుట్ సిబ్బందిని ప్రశ్నించారు. గ్రామస్తుల కోసం మరో రోడ్డు వేస్తామని చెప్పినా ససేమిరా అనడంతో యంత్రాలను తీసుకుని అక్కడి నుంచి రియల్టర్లు పరారయ్యారు. రోడ్డు పనులు చేస్తున్న స్థలం గంట్యాడ రెవెన్యూ పరిధిలో ఉండడంతో వీఆర్వో గణపతి పరిశీలించారు. దీనిపై విచారణ జరుపుతామని గంట్యాడ తహసీల్దార్ నీలకంతేశ్వరరెడ్డి చెప్పారు.